క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్థలదాత అక్షింతల రాజా, రాణి దంపతులు

గోకవరం: గ్రామంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన సూర్యబాలాజీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. సనాతన ధర్మ ప్రబోధన సమితి ఆధ్వర్యంలో స్థలదాత అక్షింతల రాజా, రాణి దంపతులు పీఠలపై కూర్చొని భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు మాట్లాడుతూ లోక కల్యాణార్థం గ్రామంలో సూర్యదేవాలయాన్ని నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, దాసరి తమ్మన్నదొర, సుంకర వీరబాబు, గాజింగం సత్తిబాబు, దాసరి చిన్నబాబు, వరసాల ప్రసాద్, కర్రి సూరారెడ్డి, మంగరౌతు రాము తదితరులు పాల్గొన్నారు.

620 మందికి వైద్యసేవలు



చినకొండేపూడిలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని చినకొండేపూడిలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు 620 మందికి వైద్యసేవలు అందించారు. అవసరమైన పరీక్షలు చేసి, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం చేశారు. అంగన్‌వాడీ సెంటర్లను సందర్శించి, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పి.రాధాకృష్ణ, సూపర్‌వైజర్ సుధాకర్, ఏఎన్ఎం కృష్ణవేణి, ఆశవర్కర్లు రామసీత, దుర్గ, లక్ష్మి పాల్గొన్నారు.

సీలింగ్ భూములకు పట్టాలు ఇవ్వాలి



కార్మిక జెండాను ఎగురవేస్తున్న రైతు కూలీ సంఘం నాయకుడు సురేష్

గోకవరం: మండలంలోని కామరాజుపేట పంచాయతీ శివరామపట్నంలో పేదలు సాగు చేసుకుంటున్న సీలింగ్ భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం డివిజన్ కార్యదర్శి దేశెట్టి సురేష్ డిమాండ్ చేశారు. మేడే వారోత్సవాల్లో భాగంగా బుధవారం గ్రామంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామరాజుపేట పంచాయతీ పరిధిలో 36 ఎకరాల సీలింగ్ భూమిని దాదాపు 25 సంవత్సరాలుగా సుమారు 76 మంది పేదలు సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ భూములపై సాగుదారులకు పట్టాలు ఇచ్చి ప్రభుత్వ రాయితీలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జోకా పెద్ద, టి.అర్జున్, ఆర్.అప్పలరాజు, ఎం.సూరిబాబు, కామరాజు, నాగచక్రం తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు



గోకవరం ఆర్టీసీ ఉద్యోగికి సర్టిఫికెట్ అందిస్తున్న డీపీటీఓ షర్మిల

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపోలో ఉత్తమ సేవలందిస్తూ తోటి ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తున్న పలువురికి సర్టిఫికేట్‌లు అందజేశారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఆర్టీసీ డీపీటీఓ షర్మిల ముఖ్యఅతిథిగా పాల్గొని 2022-23 సంవత్సరంలో అత్యధికంగా ఆయిల్ పొదుపు చేసిన 41 మంది ఉద్యోగులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ యు.రామన్న, సూపరింటెండెంట్ అప్పారావు, పలు యూనియన్ల నాయకులు ప్రగడ ప్రసాద్, మేడా మురళీశ్రీనివాస్, కొమరం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకే ధాన్యం కొనాలి

బిక్కవోలు: అకాల వర్షాలకు తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని మద్దతు ధరకే ప్రభుత్వం కొనాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన అధ్యక్షుడు కందుల దుర్గేష్ కోరారు. బుధవారం ఆయన బిక్కవోలు, ఊలపల్లి, పాకలు, పందలపాక గ్రామాల్లో పర్యటించారు. అనపర్తి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, సమన్వయ కర్త రావాడ నాగు, ఇందల వీరబాబు పాల్గొన్నారు.

వాన.. వేదన



రాజానగరం మండలం తుంగపాడులో రాలిపోయిన మామిడికాయలను ఏరుతున్న రైతు

- అకాల వర్షాలతో అష్టకష్టాలు
- స్తంభించిన జనజీవనం
- వ్యాపారాలు లేక దిగాలు

రంగంపేట: వాన నిండా ముంచుతోంది.. చిరు వ్యాపారాలపై ప్రభావం చూపుతోంది.. రోజువారీ వ్యాపారాలతో జీవనం సాగించే వారికి అష్టకష్టాలు తెచ్చిపెడుతోంది. మెట్ట ప్రాంతంలో చాలామంది దీనస్థితి ఇది. రంగంపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు రైతులు, వ్యాపారులు తమ గ్రామ పంట పొలాల్లో అనేక రకాల పండ్లు, కూరగాయలు పండిస్తున్నారు. వీటిని ఏడీబీ రోడ్డు పక్కన విక్రయించి జీవనోపాధి పొందుతున్నారు. అయితే మొన్నటి వరకూ మండుటెండ.. ఇప్పుడు జోరు వానలలో తడుస్తూ వినియోగదారుల రాక కోసం నిరీక్షిస్తున్నారు. ఎండ తీవ్రంగా ఉన్న సమయంలో ఉదయం, సాయంత్రం వేళల్లో కాస్తో.. కూస్తో వ్యాపారం సాగినా! వర్షాల కారణంగా వీస్తున్న గాలులు, కురుస్తున్న వర్షానికి ద్విచక్ర వాహదారులు ప్రయాణాలు చేయక వ్యాపారం సాగడం లేదని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. కార్లలో ప్రయాణించేవారు మాత్రం వర్షం వెలుసుబాటు ఇస్తే కార్లు ఆపి కొద్దో...గొప్పో కొనుగోలు చేస్తున్నారన్నారు. వర్షాలకు పండ్లు, కూరగాయల పంటలు పాడవుతున్నాయని చెబుతున్నారు. మండలంలోని వడిశలేరు, రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం, కోటపాడు, రామేశంపేట తదితర ప్రాంతాల్లో ఏడీబీ రోడ్డు వెంబడి అనేక గ్రామాలకు చెందిన పలువురు రైతులు, వ్యాపారులు సీజనల్‌గా పండే మామిడి, జీడి మామిడి, నేరేడు, సపోట, బొప్పాయి, పనస, జామ తదితర రకాల పండ్లు, వంగ, బెండ, బీర, చిక్కుడు, కాకర, ఆకాకర, గోరు చిక్కుడు, ఆనప తదితర కూరగాయలతో పాటు ఆకు కూరలు, తాటి ముంజులు, కొబ్బరి బొండాలు, బుర్రగుంజు, ఈతపండ్లను రైతులు, వ్యాపారులు సైకిళ్లు, బైక్‌లపై తీసుకువచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. ఎండకు ఎండి, వానకు తడిసి కుటుంబ పోషణ కోసం పాట్లు పడుతున్నామని చిరు వ్యాపారులు వాపోతున్నారు.

వదలని వానతో బెంబేలు

రాజానగరం: మూడు రోజులుగా వదలకుండా కురుస్తున్న వర్షంతో అన్నదాతలు బెంబేలెత్తిపోతున్నారు. చేతికి అందివచ్చిన పంట కళ్లెదుటే గంగపాలవుతుంటే కుమిలిపోతున్నారు. కళ్లాలో పోగు లేసిన ధాన్యం, మొక్కజొన్నలు తడవకుండా బరకాలు కప్పినా, వర్షం నీరు దిగువ నుంచి పారడంతో పాడైపోతున్నాయి. రాజానగరం మండలంలోని సంపత్‌నగరం, నామవరం, కొండగుంటూరు, తుంగపాడు, జి.యర్రంపాలెంలో చాలాచోట్ల రోడ్లపై ధాన్యం పోగులు చేసి ఉంచారు. ఈ సమయంలో వర్షాలు కురవడంతో వాటిని జాగ్రత్త చేసుకునే అవకాశం లేక, గడ్డి కప్పి, కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. సీతానగరం మండలంలో మొక్కజొన్న రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఆరబోసిన మొక్కజొన్నలను పోగువేసి, తడవకుండా బరకాలు కప్పినా ప్రయోజనం లేకుండా పోతోంది.

మామిడికి తీరని నష్టం

వరి, మొక్కజొన్నతో పాటు మామిడి, జీడిమామిడి తోటలకు కూడా వర్షం వల్ల తీవ్రనష్టం వాటిల్లుతోందని రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా మామిడి కాయలు పక్వానికి వచ్చి కోతలు జరిగే సమయంలో అకాల వర్షాలకు తోడు ఈదురుగాలులతో కాయలు రాలిపోయి, నాణ్యత దెబ్బతింటున్నాయి. దీనివల్ల అనుకున్న రేటు రాకపోగా, చాలా వరకు కాయలు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయని తోటలు కొనుగోలు చేసిన వ్యాపారులు, రైతులు వాపోతున్నారు. ఇదే పరిస్థితి జీడిమామిడి సాగులోను రైతులు ఎదుర్కొంటున్నారు. గింజలు కోతకు వచ్చే సమయంలో ఈ వర్షాలు కురియడం వలన పటుత్వం దెబ్బతింటుందని, గింజల రంగు మారిపోతుందంటున్నారు. తోకాడ, కానవరం, రాధేయపాలెం, తుంగపాడు, భూపాలపట్నం, పుణ్యక్షేత్రం, సీతారామపురం, పల్లకడియం, ముక్కినాడ మున్నగు ప్రాంతాలలో 1,050 ఎకరాలలో జీడిమామిడి, మామిడి తోటలు విస్తారంగా ఉన్నాయి.



పెదరాయవరం వద్ద ఏడీబీ రోడ్డు పక్కన వానలో పండ్ల వ్యాపారం

గోకవరం: మండల వ్యాపంగా బుధవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మరోపక్క భారీ వర్షానికి కళ్లాల్లోని మొక్కజొన్న, ధాన్యం తడిసిపోయాయి. పంటను కాపాడుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమించారు.

అంతంత మాత్రంగా ఆదాయం



అల్పపీడన ద్రోణి కారణంగా కురుస్తున్న వర్షాలు, గాలుల తీవ్రతకు చిరు వ్యాపారాలు బాగా మందగించాయి. ఏడీబీ రోడ్డులో ప్రయాణాలు తగ్గాయి. దీంతో వర్షం తగ్గినప్పుడు కాసింత వ్యాపారం జరుగుతోంది. అంతంత మాత్రంగానే ఆదాయం వస్తోంది.

– పి.దుర్గాప్రసాద్, పండ్ల వ్యాపారి, వెంకటాపురం

వాతావరణ మార్పులతో నష్టం



మొన్నటి వరకూ భరించలేని ఎండల కారణంగా ఉదయం, సాయంత్రం మాత్రమే వ్యాపారం ఉండేది. వానల కారణంగా మూడు రోజుల నుంచి వర్షం కురుస్తుండటంతో జనజీవనం స్తంభించడంతోపాటు వ్యాపారాలు జరగడం లేదు. మరో మూడు రోజులు వానలు పడతాయని అంటున్నారు. దీంతో దిక్కు తోచని స్థితిలో ఉన్నాం.

– బి. శ్రీను, వ్యాపారి, ఈలకొలను.

సక్రమంగా ధాన్యం కొనుగోలు



రఘుదేవపురంలో రైస్‌మిల్లును పరిశీలిస్తున్న అధికారులు

సీతానగరం: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు సక్రమంగా జరగాలని మిల్లర్లకు డీసీవో, మండల స్పెషల్ ఆఫీసర్ ఎంపీపీ నాగభూషణం సూచించారు. రఘుదేవపురంలో పలు రైస్‌మిల్లులను, పొలాల కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులను తహసీల్దార్ ఎస్.సత్యనారాయణతో కలసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు అధైర్యపడవద్దని, ధాన్యం కొనుగోలు వేగవంతం చేస్తామని, ప్రతిగింజను కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల (పీపీసీఎస్) సీఈవోలకు, ఆర్బీకే సిబ్బందికి సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయానికి మినీమిల్లర్ వచ్చిందని, రైతుల ధాన్యంలోని నూకశాతాన్ని చూసుకోవచ్చన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలుకు చర్యలు

గోకవరం: గత మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు తడిసిపోయిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ తెలిపారు. గోకవరంలో బుధవారం వారు విలేకర్లతో మాట్లాడారు. వర్షాల వలన ధాన్యం తడిసిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ తడిసిన ధాన్యాన్ని పౌరసరఫరాశాఖ ద్వారా కొనుగోలు చేయడానికి నిర్ణయించారన్నారు. తడిసిన ధాన్యాన్ని మండలంలోని గుమ్మళ్లదొడ్డి, కోరుకొండ రైసు మిల్లులకు తరలించడానికి ఆదేశాలు జారీ చేశారన్నారు. తడిచిన ధాన్యం ఉన్న రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు, వీఏఏలకు తెలిపి ధాన్యం తరలించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, కర్రి సూరారెడ్డి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

అంతటా ఆధ్యాత్మిక శోభ

అనపర్తి: పొలమూరులో రుక్మిణీ, సత్యభామా సమేత మదనగోపాల స్వామివారి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ప్రధాన కర్తలుగా, డాక్టర్ సత్తి గౌతమ్‌రెడ్డి, ప్రియాంక దంపతులు విశేష పూజలు చేశారు. ఈ పూజా క్రతువులను తిరుమల తిరుపతి దేవస్థానం విద్వాంసుడు వేదాంతం శ్రీవిష్ణు భట్టాచార్యులు, మిక్కిలి దుర్గయ్యశాస్త్రి పర్యవేక్షణలో నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ఉంటున్న వారంతా స్వగ్రామానికి చేరుకుని ఈ ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్ల విగ్రహాలతో పాటు యంత్ర, విమాన శిఖర, బలిపీఠ, జయ తదిత విగ్రహ ప్రతిష్ఠ, సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి విజయమణి, జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి రమా, సత్తి బ్రహ్మారెడ్డి గంగాపార్వతి, తాడి సత్తిరెడ్డి సుబ్బలక్ష్మి, తాడి వీరవెంకటరెడ్డి కమల, సత్తి వెంకటరెడ్డి వీర అనంతలక్ష్మి, ఆలయ కమిటీ చైర్మన్ తమలంపూడి ఆదిరెడ్డి వీరయ్యమ్మ దంపతులు పూజలు చేశారు. సాయంత్రం జరిగిన రుక్మిణీ, సత్యభామా సమేత శ్రీమదన గోపాలస్వామి వార్ల శాంతి కల్యాణంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొని క్రతువును జరిపించారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి, డాక్టర్ గౌతమ్‌రెడ్డి, ప్రియాంక

వైభవంగా మేలుకొలుపు

బిక్కవోలు: పందలపాకలో సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవం సందర్భంగా అమ్మవారి మేలుకొలుపు కార్యక్రమం వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యుడు పడాల రామారెడ్డి తెలిపారు. ఐదేళ్లకు ఒక్కసారి జరిగే ఈ జాతర 5 రోజుల పాటు జరుగుతుందన్నారు. అనంతరం అమ్మవారి ప్రతిరూపాలను గ్రామంలో ఊరేగించారు. 8వ తేదీతో వేడుకలు పూర్తవుతాయన్నారు. అమ్మవారిని పడాల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు దర్శించుకుంటున్నారని తెలిపారు.



పందలపాకలో సత్తెమ్మ తల్లి విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

కుంతీదేవి జాతర ప్రారంభం

ఊలపల్లిలో కుంతీదేవి జాతర ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామస్తులంతా ఊరేగింపుగా పొలాల నుంచి వరి దుబ్బులు తీసుకువచ్చి అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఇప్పటి నుంచి మే 23 వరకూ జాతర మహోత్సవాలు జరుగుతాయని కుంతీదేవి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సువర్ణ నేత్రాల సమర్పణ

కడియం: కడియపులంకలోని పుంతలో ముసలమ్మ అమ్మవారికి నర్సరీ రైతు పుల్లా ఆంజనేయులు, వీరవేణి దంపతులు బుధవారం సువర్ణ నేత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. నేత్రాలను అమ్మవారి ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నర్సరీ రైతులు, పుల్లా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

8 నుంచి వేసవి శిక్షణ

ప్రకాశం నగర్: సీతంపేట గ్రంథాలయంలో ఈనెల 8 నుంచి విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి ఓ.సుగుణ తెలిపారు. ఈ మేరకు బుధవారం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూలం వెంకన్న బాబు, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీఎల్ఎస్ఎస్‌వీ ప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ శిక్షణలో కథలు చెప్పడం, చదివించడం, స్పోకెన్ ఇంగ్లిష, చిత్రలేఖనం, వేదిక్ మాక్స్, తెలుగు పద్యాలు, పాటలు క్రాఫ్ట్ బొమ్మల తయారీ వంటివి నేర్పిస్తామన్నారు. జూన్ 11 వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలు



రంగంపేట సత్యసాయి సమాజ సేవా కేంద్రంలో శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు

రంగంపేట: ప్రత్యక్ష దైవాలైన తల్లిదండ్రులను బాల్యం నుంచి విద్యార్థులు గౌరవించాలని ఉపాధ్యాయుడు ఉండవిల్లి సూర్యభాస్కరరావు అన్నారు. స్థానిక సత్యసాయి సమాజ సేవా కేంద్రంలో బాల వికాస్ వారోత్సవాల సందర్భంగా బుధవారం ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. దేశ భక్తుల కథలు, వారి జీవితాలను స్ఫూర్తిగా తీసుకుని ఉత్తమ పౌరులుగా తయారు కావడానికి కృషి చేయాలన్నారు. సత్యాన్ని పలకడం, చదువు ఆవశ్యకతను తెలుసుకుని ఆ దిశగా నిరంతరం సాధన చేయాలని అన్నారు. ఈ సందర్భంగా బాల వికాస్ గురువులు ఎల్. శ్రీనివాసరాజు, ఎల్ఎస్ఎస్ కిరణ్‌లు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. చిత్రలేఖనంపై డ్రాయింగ్ టీచర్ రాజి విద్యార్థులకు పలు సూచనలు చేసి ప్రయోగాత్మకంగా ఆకర్షణీయమైన బొమ్మలు గీయించారు. అలాగే కోటపాడు, ఈలకొలను గ్రామాల్లో బాలవికాస్ గురువులు కె.భానుమతి, టి.శ్రీనివాసరావులు విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో జోనల్ కన్వీనర్ మర్రెడ్డి వీర్రాజు, సమితి కన్వీనర్లు కందర్ప అమరనాథ్, టి.సుబ్బారావు, సేవాదళ్ సభ్యులు వి.వెంకట్రావు, రంగమాంబ, ప్రసన్న పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగాలి

అనపర్తి: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు, రైస్ మిల్లర్లు కలిసిరావాలని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఏఎంసీ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై ఆయన రైస్‌మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ అకాల వర్షంతో తమ పంటను కాపాడుకునేందుకు రైతులు తీవ్ర అగచాట్లు పడుతున్నారని అన్నారు. ఈ సమయంలో రైతుల నుంచి ధాన్యం సేకరణలో అధికారులు, రైస్ మిల్లర్ల మధ్యన అవగాహన, సమన్వయం అవసరమన్నారు. తడిచిన ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం ప్రకటించే విధానంపై రైతులకు అవగాహన కల్పించి వారికి గిట్టుబాటు ధర అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పంట నష్టంపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి అధికారులు అంచనాలు రూపొందించాలని సూచించారు. అన్నదాతల కష్టాలను టీడీపీ రాజకీయాలు చేస్తోందన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైస్ మిల్లర్ల ద్వారా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి ముడుపులు అందుతున్నాయంటూ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేస్తున్న ఆరోపణల్లో నిజమెంత అనేది రైస్ మిల్లర్లకే తెలుసునని అన్నారు. సమావేశంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల తహసీల్దార్లు, వ్యవసాయశాఖ అధికారులు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

ఆకట్టుకున్న ఇంద్రచాపం



దివాన్‌చెరువులో ఏర్పడిన ఇంద్రధనుస్సు

రాజానగరం: చెదురు మదురుగా కురుస్తున్న వర్షం, మరోవైపు మేఘాల చాటు నుంచి ప్రసరిస్తున్న సూర్యకిరణాలతో ఆకాశంలో ఏర్పడిన ఇంద్రధనుస్సు ఎంతో ఆకట్టుకుంది. దివాన్‌చెరువులో బుధవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి మూడు వేర్వేరు ప్రాంతాలలో మూడు ఇంద్రధనస్సులు కనువిందు చేశాయి.

నిబంధనల మేరకే వ్యవహరించాలి

కడియం: కేబుల్, పంచాయతీ విద్యుత్ సిబ్బంది విద్యుత్ స్తంభాలు ఎక్కేటప్పుడు, కేబుల్ వైర్లు అమర్చేటప్పుడు నిబంధనల మేరకు వ్యవహరించాలని కడియం విద్యుత్ శాఖ ఏఈ రామారావు బుధవారం ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ముందుగా తమ శాఖకు సమాచారం ఇస్తే విద్యుత్ సంబంధిత ప్రమాదాలు జరక్కుండా చర్యలు తీసుకోగలుగుతామన్నారు. ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ స్తంభాలు ఎక్కడం, వాటిపై కేబుళ్లు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందన్నారు. ఈ మేరకు సంబంధిత కేబుల్, పంచాయతీలకు సమాచారం అందజేసినట్లు తెలిపారు.

దొండ రైతులకు నష్టాల బెంగ

- పడిపోయిన ధర
- కిలో రూ.3కు వ్యాపారుల కొనుగోలు

సీతానగరం: దొండ రైతులకు నిరాశే మిగిల్చింది. అందిన కాడికి అప్పులు చేసి, పెట్టుబడులు పెట్టి లాభాలు వస్తాయని సంబరపడే సమయంలో ఒక్కసారిగా ధర పడిపోయింది. దీనితో నష్టాలే మిగిలాయి. ముఖ్యంగా రైతులు దళారుల చేతుల్లో మోసపోతూనే ఉన్నారు. వారు కిలో రూ.3కు కొనుగోలు చేసి, దుకాణాల్లో మాత్రం రూ.25 నుంచి రూ.30 వరకు అమ్మకాలు జరుపుతున్నారు. మండలంలోని సుమారు 600 ఎకరాల్లో దొండపాదులు సాగవుతున్నాయి. వంగలపూడి, రామచంద్రపురం, పురుషోత్తపట్నం, సీతానగరం, చినకొండేపూడిలో ఎక్కువగా సాగుచేస్తున్నారు. ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.70 వేలు వరకు శిస్తు చెల్లించి దొండ పాదులు పెట్టారు. వాతావరణం కూడా అనుకూలించడంతో పాదులు మంచి దిగుబడి వస్తుందని రైతులు ఆశించారు. అయితే పది కిలోల దొండకాయలు రూ.160 వరకు ఉండే ధర ఒక్కసారిగా పది కిలోలు రూ.30కి పడిపోయింది. దీంతో రైతులు ఒక్కసారిగా కుదేళ్లయ్యారు.

ఎకరానికి రూ.2 లక్షల ఖర్చు

ఎకరంలో దొండ సాగుకు సంబంధించి విత్తనాలు, పందిరి కర్రలు, వైర్లు, పాదుల పెట్టుబడి, కోత కూలీలకు, ఎరువులు, పురుగుల మందులకు కలిసి రూ.2 లక్షల వరకు ఖర్చు అవుతుంది. శిస్తు రూ. 60 వేలు పెట్టిన రైతులకు పెట్టుబడి, శిస్తు వచ్చే అవకాశం కూడా లేకుండా పోయింది. ఎనిమిది నెలలు పంట అయిన దొండపాదులు రెండు నెలలు అనంతరం ఆరు నెలలు కాపులో ఉంటుంది. ఈ ఏడాది ఎకరానికి పంట పూర్తయ్యే సమయానికి 20 నుంచి 30 టన్నుల వరకూ దిగుబడి వస్తుంది. వాతావరణం అనుకూలిస్తే 35 టన్నులకు పైగా వస్తుంది.



చినకొండేపూడిలో సాగుచేస్తున్న దొండ పాదులు

రైతుల ఆవేదన

ప్రస్తుతం పది కిలోల దొండకాయలు కేవలం రూ.30 మాత్రమే ఉండటంతో ఏమి చేయలేని పరిస్థితిలో రైతులున్నారు. కాయలను నిల్వ ఉంచి అమ్మకాలు జరపడానికి వీలులేని పరిస్థితి. వారానికి ఒక్కసారి మాత్రమే దొండకాయలు కోసి, పంటభూమి వద్దకు వ్యాపారులు వచ్చి, తూకం వేసుకుని కొనుగోలు చేస్తున్నారు. ఆ విధంగా కొనుగోలు చేసిన దొండకాయలను వ్యాన్లపై ఇతర ప్రాంతాలకు తరలించి అమ్మకాలు జరుపుతారు.

నష్టాలే మిగిలాయి



రెండు ఎకరాల్లో దొండపాదులు పెట్టాను. ఎకరం శిస్తుగా రూ.55 వేలు చెల్లించి, పెట్టుబడిగా రూ.రెండు లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాను. ప్రస్తుతం కిలో ధర రూ.3 మాత్రమే ఉంది. దీనితో నష్టాలు కలుగుతున్నాయి.

– మేడిశెట్టి శ్రీనివాస్, కౌలు రైతు, చినకొండేపూడి

ప్రభుత్వం ఆదుకోవాలి



ఎకరంలో దొండపాదులు పెట్టాను. ప్రస్తుతం కిలో దొండకాయలను రూ.3కు కొనుగోలు చేస్తున్నారు. శిస్తు, పెట్టుబడి రూ.2 లక్షలు అయ్యింది. అంతా నష్టమే. ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో ఉన్నాను. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

– తోరం శోభనబాబు, కౌలు రైతు, లంకూరు

డాగ్ స్క్వాడ్‌కు టీషర్టుల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని కుక్కలను పట్టుకుని బర్త్ కంట్రోల్ ఆపరేషన్ నిర్వహించే మున్సిపల్ డాగ్ స్క్వాడ్ టీమ్‌కు బుధవారం టీషర్టులు పంపిణీ చేశారు. నగరపాలక సంస్థ ఎంహెచ్ఓ డాక్టర్ వినూత్న మాట్లాడుతూ గతంలో గ్రీన్ కలర్ టీ షర్టులు ఉండేవని, తాజాగా ప్రత్యేక గుర్తింపుగా ఉండేందుకు రెడ్ కలర్ టీషర్టులు అందజేస్తున్నట్లు తెలిపారు. వీటిని డిప్యూటీ ఎంహెచ్ఓ మధుబాబు చేతుల మీదుగా 20 మంది సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్ అన్నమయ్య, డివైస్ మేనేజర్ ధనేకుల లావణ్య పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతర ప్రారంభం

కడియం: మండలంలోని దుళ్ల గ్రామదేవత పోలేరమ్మ తీర్థమహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి జాతర ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం పెద్ద జాతర, గురువారం చిన జాతర, శుక్రవారం తీర్థం నిర్వహిస్తారు. 7వ తేదీన అన్నసమారాధన జరుగుతుంది.